క్లుప్తంగా

వేతనాలు పెంచాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకులు తమకు వేతనాలు పెంచాలని కోరుతూ ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు తమకు 12 నెలలకు కన్‌సాల్‌డేటెడ్ వేతనాలు రూ.50వేలు ఇవ్వాలని కోరారు. విషయంపై ఆయన సానుకూలంగా స్పందిందిచినట్లు రవీందర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల పంపిణీ



నవాబుపేట: త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్లను మంగళవారం పంపిణీ చేశారు. సేవాసమితి నిర్వాహకులు బుచ్చిలింగం, నాగ్యానాయక్ మాట్లాడుతూ కొల్లూర్‌లో ప్రతి ఇంటికి అందజేశామని వివరించారు. అదేవిధంగా త్రైత సిద్ధాంత భగవద్గీత అంశాలు గురించి అవగాహన కల్పించారు.

అధ్యక్షుడిగా షేక్ హాజీ

జడ్చర్ల టౌన్: నియోజకవర్గ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా షేక్ హాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మంగళవారం మండల యూనియన్ నూతన అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నికై నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డిని కలిసి సన్మానించారు. రాష్ట్ర బీసీ నేత చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం : కేసునమోదు

భూత్పూర్: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. గొరిటకి చెందిన యువతికి మూసాపేటకు చెందిన శంకర్‌తో వివాహం జరిగింది. కాగా ఈ నెల 20న ఆమెను తన తండ్రి శంకరయ్య అత్తగారి గ్రామమైన మూసాపేటకు పంపించే క్రమంలో భూత్పూర్‌కు తీసుకువచ్చారు. మూసాపేట బస్సు కోసం చౌరస్తాలో వేచి చూశారు. ఈ క్రమంలోనే ఆమె అకస్మాత్తుగా కన్పించకుండా పోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ఆమె తండ్రి శంకరయ్య భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



జడ్చర్ల: మాజీ సీఎం ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని ఆయన అభిమానులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన జయంతిని స్థానిక నేతాజీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. వార్డు కౌన్సిలర్ రమేశ్, నాయకులు పరమటయ్య, వెంకటయ్య, వెంకటరమణ, నరేందర్, కృష్ణ, జావీద్, శేఖర్, కేశవులు, మధు తదితరులు పాల్గొన్నారు.

భారంగా మారిన నిర్వహణ



కోయిల్‌కొండ వ్యూ

- పంచాయతీల్లో వేధిస్తున్న నిధుల కొరత
- నామమాత్రంగా ప్రత్యేకాధికారుల పాలన



చంద్రాస్‌పల్లి పంచాయతీ భవనం

కోయిల్‌కొండ: మండల పరిధిలోని పంచాయతీల నిర్వహణ నిధుల కొరతతో భారంగా మారింది. దీంతో వివిధ పనులు నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామపంచాయతీలు ఏర్పడిన తర్వాత నిర్వహణ కోసం ప్రభుత్వాలు ప్రతి నెలా నిధులు మంజూరు చేసేవి. ఆయా నిధుల సాయంతో ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పంచాయతీలలో పనులు చేయించేవారు. కాగా సర్పంచుల పదవిలో ఉన్నప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరులేకపోవడం, పార్లమెంట్ ఎన్నికల ప్రకటన నాటి నుంచే కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే ఆర్థిక సంఘం నిధులు మంజూరూ నిలిచిపోవడంతో సమస్యలు తప్పడం లేదు. గ్రామపంచాయతీల్లో అరకొరగా ఉన్న నిధుల నిల్వలను విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపునకు వినియోగిస్తున్నారు. ఇతర ఏ అవసరం ఉన్నా అప్పులు చేయక తప్పని పరిస్థితి. గతంలో సర్పంచులు తమ పదవీకాలంలో చేసిన పనులకు నిధుల చెల్లింపు నేటికీ బకాయిగానే ఉండిపోయింది. కొన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం నాటికి కార్యదర్శులు గ్రామపంచాయతీల్లో కనీస నిధులు కూడా లేకుండా పోవడం గమనార్హం. ప్రతిరోజు పారిశుద్ధ్య పనులలో భాగంగా ఇంటింటా చెత్తసేకరణ కోసం వినియోగించే ట్రాక్టర్‌కు డీజిల్ కొనుగోలు చేయాలన్నా కార్యదర్శులకు సమస్యగా మారింది. వీటికి తోడు వేసవిలో నీటి ఎద్దడి నివారణ పేరుతో పైప్‌లైన్ చేతిపంపులకు మరమ్మతుల పేరిట కొన్ని గ్రామాల్లో కార్యదర్శులు ఖర్చు చేశారు. నర్సరీల షెడ్‌నెట్, ఎరువులు, నీటి సౌకర్యం వంటివన్ని అప్పులు చేసి సమకూర్చుతున్నామని కార్యదర్శులు చెబుతున్నారు. వర్షాలు సమీపిస్తున్నందునా బ్లీచింగ్‌పౌడర్ సిద్ధం చేయాలని, మురుగుకాల్వలు శుభ్రం చేయించాలని, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి మట్టితో పూడ్చివేయాలన్న ఆదేశాల నేపథ్యంలో నిధులు లేకుండా ఇవన్నీ చేయడం ఎలా అని కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పంచాయతీలలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. కానీ వారి పాలన నేడు నామమాత్రంగానే కనిపిస్తోంది. ఫైళ్లపై సంతకాలు చేయడానికి మినహా, పంచాయతీల నిర్వాహణ, అభివృద్ధిలో వారి భాగస్వామ్యం శూన్యమేనని చెప్పడం అతిశయోక్తికాదేమో. ప్రస్తుతం నిధుల లేమి సమస్యగా మారడం వల్ల కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొనడంపై ప్రత్యేకాధికారులు దృష్టి సారించడం అటుంచితే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం కూడా చేయకపోవడం విచారకరమని పలువురు వాపోతున్నారు. కాగా ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే.. వచ్చేనెల నుంచి మరిన్ని సమస్యలు ఎదురవుతాయనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు స్పందించి తక్షణం నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అప్పులు తేవాల్సిన పరిస్థితి నెలకొంది

కొన్ని నెలలుగా ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు కావడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయటి నుంచి అప్పులు తెచ్చి గ్రామాలల్లో అభివృద్ధి పనులు చేయాల్సి వస్తోంది. ఇది పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

– చంద్రకాంత్, పంచాయతీకార్యదర్శి, చందాపూర్

నిధుల కొరతతో సమస్య

పంచాయతీలకు నిధుల మంజూరులేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. మండలంలో ఇప్పటికే రూ.2.25కోట్ల వరకు పెండింగ్ నిధులు రావాల్సి ఉంది. చాలామంది కార్యదర్శులు పంచాయతీల నిర్వాహణ విషయంలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో కార్మికుల వేతనాలు కూడా నిలిచిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ఎంపీడీఓ కాళప్ప, కోయిల్‌కొండ

ఘనంగా సురవరం ప్రతాపరెడ్డి జయంతి



సురవరం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం సురవరం ప్రతాపరెడ్డి ఘనంగా జయంతి నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి పాల్గొని సురవరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా, పండితుడిగా, రచయితగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి ఎనలేనిదని అన్నారు. సురవరం రచనల ద్వారా ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని, ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఏపీ.మిథున్ రెడ్డి, సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు జి.వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి ఎస్.సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్‌రెడ్డి, బెక్కరి అనిత, స్వరూప, వనజ, వరలక్ష్మి, కౌన్సిలర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, రావుల అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురవరం బహుముఖ ప్రజ్ఞాశాలి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ సాహిత్యానికి జాతీయ స్థాయిలో సురవరం ప్రతాప్‌రెడ్డి గుర్తింపు తీసుకొచ్చారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక పద్మావతీకాలనీలోని ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు సురవరం కపిల్, నివేదితతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సురవరం బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కౌన్సిలర్లు అనంతరెడ్డి, పటేల్ ప్రవీణ్‌కుమార్, రామలక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లు నర్సింహా రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తత అవసరం

నారాయణపేట రూరల్: పోలీసు వాహనాలను నడిపించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంటీఓ ఆర్ఎస్ఐ శివశంకర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసు వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పెట్రోలింగ్ విధులు చేపట్టే పోలీసులు నిరంతరం కేటాయించిన ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తుండాలని, వాహనానికి జీపీఎస్ సిస్టం కనెక్ట్ చేయబడి ఉందని చెప్పారు. ముందస్తు నేరాల కట్టడికి ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. కంప్యూటర్ ఆధారంగా వాహన రూట్‌లను చెక్ చేయడం జరుగుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు.

సావర్కర్‌కు ఘననివాళి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం స్వాతంత్య్ర సమరయోధుడు వినాయక దామోదర సావర్కార్ 142వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, తపస్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, భావసమైక్యవేదిక తదితర సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాగురావునామాజీ, రఘువీర్‌యాదవ్, వెంకటయ్య, క్యాతన్‌రఘునాథ్, మిలగిరికాంబ్లే, పస్పుల రవి పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కొత్త యూనిఫాం అందజేసేందుకు గాను ప్రస్తుతం మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టిచింగ్ పనులు కొనసాగుతున్నాయి. కాగా, మంగళవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి స్థానిక కలెక్టర్‌బంగ్లా చౌరస్తాలోని కటింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అలాగే అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక కుమ్మరివాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు.

విత్తనాల విక్రయాలు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఏఓ వెంకటేశ్

జడ్చర్ల: వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని.. పారదర్శకంగా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ ఆదేశించారు. మంగళవారం జడ్చర్లలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి విత్తన డీలర్ల సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రధానంగా లూజ్, బీటీ 3 విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పత్తి, ఆముదాలు, మొక్కజొన్న, జొన్న, కంది, వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ



ఇప్పటూర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నవాబుపేట: గాలీవాన బీభత్సంలో నేల కూలిన విద్యుత్ లైన్లకు సంబంధించిన మరమ్మతు పనులను ఒక్క రోజులోనే పూర్తి చేసి సరఫరా పునరుద్ధరించినట్లు ఏడీ థౌర్యానాయక్ మంగళవారం తెలిపారు. కాగా ఆదివారం మండల పరిధిలోని ఇప్పటూర్, చౌటపల్లి గ్రామాల్లో గాలివానకు స్తంభాలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టిన అధికారులు నూతనంగా 20 విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా రైతుల వ్యవసాయ పొలాలకు వెళ్లే లైన్‌కు సంబంధించి పోల్స్‌ను ఏర్పాటు చేసి మంగళవారం విద్యుత్ సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం రెండు గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్య లేదన్నారు.

జీలుగ విత్తనాల కొరత.. రైతుల ఆందోళన



అప్పంపల్లి కేంద్రం విత్తనాల కోసం వచ్చిన రైతులు

చిన్నచింతకుంట: జీలుగ విత్తనాల కొరతతో విక్రయాల కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. భూసారం పెంచే దిశగా వ్యవసాయ అధికారులు కృషి చేస్తు రైతులకు విత్తనాలపై అవగాహనలు కల్పించారు. కానీ సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక కేంద్రానికి వారానికి వంద బస్తాలు మాత్రమే సరఫరా అవుతుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ క్రమంలోనే కేంద్రాల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నాను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి స్టాక్ వచ్చినప్పుడు రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 860 బస్తాలు అందించగా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంకా 500 బస్తాలకు ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు.

రోడ్డుప్రమాదంలో కార్యదర్శులకు గాయాలు



మహమ్మదాబాద్: రోడ్డు ప్రమాదంలో కార్యదర్శులు గాయపడిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని వివిధ గ్రామాల కార్యదర్శులు మంగళవారం మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశానికి బయలుదేరారు. ఇదే సమయంలో ఎదురుగా తాండూరు వైపు నుంచి ఓకారు వేగంగా దూసుకువచ్చింది. డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో కార్యదర్శులు వెళ్తున్న వాహనాన్ని ఢీ కొట్టింది. ఘటనలో కారులో ఉన్న వ్యక్తులతో పాటు.. కార్యదర్శులకు సైతం గాయాలయ్యాయి. ఘటనపై మహమ్మదాబాద్ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు తాండూరు వైపు నుంచి వచ్చిన కారుడ్రైవరును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

జోరుగా మొక్కలు నాటే పనులు



దేవరకద్ర: మండలంలో జోరుగా మొక్కలు నాటే పనులు సాగుతున్నాయి. దేవరకద్ర నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా.. అదేవిధంగా బస్వాయపల్లి వైపు వెళ్లే దారిలో పనులు చేపట్టారు. వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో భూమి తడిసి మొక్కలు నాటడానికి అనువుగా మారడంతో ఉపాధి హామీ పథకం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గుంతలు తీయడం, మొక్కలు నాటి వాటికి నీరు పోయడం వంటి పనులు చేస్తున్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈవో సీత్యానాయక్‌లు మొక్కలు నాటే పనులను మంగళవారం పర్యవేక్షణ చేశారు.

తెలంగాణలో సంగీత దర్శకులు లేరా?

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర గీతంపై ఆంధ్ర సంగీత దర్శకుడైన కీరవాణి పెత్తనం ఏమిటని.. తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌చందర్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. నాలుగు కోట్ల ప్రజల కలల ప్రతిరూపమైన గీతానికి తెలంగాణలో సంగీత దర్శకులు సీఎం రేవంత్‌రెడ్డికి దొరకలేదా ని నిలదీశారు. ఒక రణనినాదమైన ధిక్కార స్వరమైన ఆ గీతానికి తెలంగాణలోసంగీత దర్శకులే కరువయ్యారా అని అన్నారు. కీరవాణికి స్వర కూర్పు బాధ్యతను అప్పగించడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని మరోసారి ఆంధ్రకు తాకట్టు పెట్టినట్లేనని పేర్కొన్నారు.

బాధ్యులందరినీ అరెస్టు చేయాలి



ఫిర్యాదు చేయడానికి వచ్చిన కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ క్రైం: బండమీదిపల్లి మల్లికార్జున వైన్స్ ఘటనలో మృతిచెందిన శ్రీకాంత్ యాదవ్ కేసులో ఉన్న బీచు రఘుపతిరెడ్డి, శివశంకర్‌లను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని నాయకులు అన్నారు. మంగళవారం రూరల్ సీఐ గాంధీ నాయక్‌ను కలిసి శ్రీకాంత్ కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ కేసులో ఉన్న బాధ్యులందరికీ శిక్షపడే విధంగా పోలీసులు సహకరించాలన్నారు. శ్రీకాంత్ మరణం తర్వాత తండ్రికి గుండెపోటు వస్తే ఇటీవల స్టంట్ వేశారని అన్నారు. బాధిత కుటుంబానికి సరైన న్యాయం చేయాలని కోరారు. మైత్రి యాదయ్య, శ్రీనివాస్, రాకేష్ పటేల్, చందుయాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

జూన్ ఒకటి నాటికి దుస్తులు సిద్ధం కావాలి



సమీక్షలో పాల్గొన్న అధికారులు

నవాబుపేట: జూన్ 1 నాటికి విద్యార్థులకు అందించే దుస్తులు సిద్ధం చేయాలని డీఆర్‌డీఓ నర్సింహులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో 91 పాఠశాలలకు సంబంధించి దాదాపుగా 4,890 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారందరికీ అందించేలా దుస్తులు త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. కాగా మండలంలో 3 వేలమందికి సంబంధించి దుస్తులు కొలతల ప్రకారం కటింగ్ పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. 9 వందల డ్రస్‌లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ జ్యోతీ, వెలుగు ఏపీఎం జీవరత్నం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ బోనాలు



మిడ్జిల్‌లో బోనాల వేడుకలో పాల్గొన్న భక్తులు



కౌకుంట్లలో బోనాలతో ఊరేగింపు



బోనాల ఊరేగింపులో పాల్గొన్న యువతులు

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో మంగళవారం అంగరంగ వైభవంగా పెద్దమ్మ బోనాల పండుగ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటినుంచి మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయం నుంచి బోనాల ఊరేగింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా భాజా భజంత్రీలతో పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామం అంతా సందడి నెలకొంది. జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీ కిష్టన్న, మాజీ సర్పంచ్ స్వప్న, నాయకులు కిషన్‌రావు, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, పవన్‌కుమార్ యాదవ్, జాంగిర్, కిరణ్ కుమార్, కృష్ణయాదవ్, శివ కుమార్, ఆనంద్‌రెడ్డి, రవి, నీలి ఆంజనేయులు, నరేష్, మహేశ్ ఇంకా పలువు పాల్గొన్నారు.



నేరళ్లపల్లిలో బోనాల వేడుక

మిడ్జిల్: మండల కేంద్రంలో బొడ్రాయి ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఈదమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాల నడుమ భారీఎత్తున ఊరేగింపు కొనసాగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున వేడుకలో పాల్గొన్నారు.

బాలానగర్: నేరళ్లపల్లిలో ఎల్లమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ ఆడపడుచులు బోనాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.